క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



పాలమూరు: ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్వాహకులు సరైన నిబంధనలు పాటించాలని, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని సిరి చిన్న పిల్లల ఆస్పత్రి, సునీత, బిందు ఆస్పత్రులను బుధవారం డీఎంహెచ్‌ఓతో పాటు జిల్లా మాస్ మీడియా అధికారిని మంజుల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో ధరల పట్టికలు, ఇతర వసతులు, బయో మెడికల్ వేస్టేజీ సిస్టమ్, అగ్నిమాపక నిబంధనలు పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వద్ద అధిక డబ్బులు వసూలు చేయరాదని తెలియజేశారు.

పాఠశాలల పరిశీలన



దేవరకద్ర: మండలంలోని పలు పాఠశాలలను జిల్లా విద్య అకాడమిక్ మానిటరింగ్ అధికారి డి.శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవరకద్రతో పాటు గూరకొండ, బస్వాపూర్, పెద్దరాజమూర్, నాగారం పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు మెరుగ్గా ఉండాలని కోరారు. రమేశ్, హెచ్‌ఎం రాధిక తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలి



మిడ్జిల్: వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండపాల వద్ద ఎప్పుడూ ఇద్దరు నిర్వాహకులు ఉండాలని సూచించారు. అఖిల పక్షం నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు, రాజేశ్వర్, లాలు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఊరేగింపు

గండేడ్: సీతారామ స్వాముల ఊరేగింపు శోభాయమానంగా కొనసాగింది. బుధవారం మండల పరిధిలోని వెన్నాచేడ్‌లో సీతారాములు నిత్య అభిషేకం, అఖండ భజన కార్యక్రమం ముగించారు. ఈ సందర్భంగా సీతారాముల శోభాయాత్ర నిర్వహించారు. ట్రాక్టర్‌పై సీతారాముల చిత్రపటాలు ఏర్పాటు చేసి ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పల్లెల్లో చెరువుల పండగ

నవాబుపేట: మండలంలో చెరువులు నిండి అలుగులు పారుతుండటంతో జనం సంబురాలు జరుపుకొంటున్నారు. బుధవారం మండల పరిధిలోని లోకిరేవు చెరువు చెంత గ్రామ మహిళలు బతుకమ్మ ఆటలతో అలరించి పూజలు చేశారు. దీంతో పాటు మండల పరిధిలోని పోమాల్, కొల్లూర్, చౌడూర్ గ్రామాల్లోని చెరువులకు సైతం గ్రామస్తులు పూజలు చేశారు.

అత్యవసరంలో షీటీంకు ఫిర్యాదు చేయండి

మహబూబ్‌నగర్ క్రైం: కళాశాలతో పాటు రోడ్లపై ఏమైనా వేధింపులకు గురైతే షీటీం దృష్టికి తీసుకురావాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో షీటీం పనితీరుపై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళ అక్రమ రవాణా, బాలల దుర్వినియోగం, బాల్యవివాహాలు, బాల కార్మికులు, చైల్డ్ లైన్ 1098లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినిలకు అత్యవసరం అయితే డయల్ 100 లేదా షీటీం నంబర్ 8712659365లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాణి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం క్రిస్టియన్‌పల్లి రెవెన్యూ గ్రామ శివారు సర్వే నంబర్ 523లో ప్రభుత్వం వికలాంగులకు కేటాయించిన స్థలాలపై తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి సకలాంగులు బోగస్ పట్టాలు సృష్టించుకున్నారని ఉదయ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు ఆరోపించారు. వికలాంగుల కాలనీలో ఫోర్జరీ సంతకాలతో పట్టాలు పొంది అనేక అక్రమ నిర్మాణాలు జరిపారని కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇందుకు కలెక్టర్‌కు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వికలాంగులు వెంకటేష్, నాగరాజు, పాండు, విందునాయుడు, ఈ.వెంకటేష్ ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి



మిడ్జిల్ కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయేందిర

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ విజయేందిర వైద్యాధికారికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మందులు, ఆస్పత్రి ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఆస్పత్రిలోకి నీరు రావడంతో రోగులకు ఇబ్బంది కల్గిందని మరోసారి అలా కాకుండా చూసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి ఎలాంటి కేసులు వస్తున్నాయి, రోజు ఎంత మంది రోగులు వస్తున్నారని వైద్యురాలిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. పాఠశాల వెనుక ఉన్న మురుగు నిల్వ లేకుండా చూడాలని జిల్లా ఈఈని ఆదేశించారు. అలాగే పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉంటుందని ప్రత్యేకాధికారిణి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. తక్షణమే పనులు చేయించాలని ప్రహరీ చుట్టూ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలోకి నీరు రావడంతో విద్యార్థినులకు ఇబ్బంది కలుగుతుందని పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని సూచించారు. ఆర్‌ఓఆర్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ జగదీశ్వర్, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ప్రకృతిలో ప్రతిమొక్క పరమౌషధం



గార్డెన్‌లో మొక్కనాటిన అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: ప్రకృతిలోని ప్రతి మొక్క పరమౌషధమని పాలమూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.కె.బృందాదేవి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'ఔషధ మొక్కల ప్రాముఖ్యత-తయారీ' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రతి మొక్క ఔషధంగా ఉపయోగపడుతుందని, అటువంటి మొక్కల గూర్చి విద్యార్థులకు విజ్ఞానం అందించేందుకు తెలంగాణ బొటానికల్ గార్డెన్ ప్రత్యేక స్థలమన్నారు. పొడపత్రి మొక్క షుగర్‌వ్యాధి నివారణకు ఉపయోగించవచ్చని, దాని ఉపయోగాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూయించి ప్రయోగం ద్వారా వివరించారు. మరో వక్త డా.శివకుమార్ మాట్లాడుతూ.. పూర్వీకుల కాలం నుంచి వేదాల్లోని ఔషధ విజ్ఞానం గూర్చి తెలియజేశారు. నాటి నుంచి భారతీయులు ఔషధాలను ఎలా తయారు చేశారో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య మాట్లాడుతూ.. బొటానికల్ గార్డెన్‌లో 350 రకాల ఔషధ మొక్కలు ఉన్నాయన్నారు. భావి తరాలకు ప్రకృతిలోని ఔషధ మొక్కలను అందించటంతో పాటు వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించామన్నారు. వివిధ యూనివర్సిటీ విద్యార్థులు పరిశోధనలు చేసుకునేందుకు వీలుగా గార్డెన్ ఉందన్నారు. వృక్షశాస్త్ర విభాగ అధిపతి డా.నర్మ, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య మాట్లాడుతూ.. ఆధునిక కాలంలోని ఆధునిక ఔషధాలు అన్ని ఒకప్పటి ప్రకృతి ఔషధాలేనన్నారు. అధ్యాపకురాలు లత, రాహుల్, లక్ష్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషణమాసం ప్రారంభం



మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బోయపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త అరుణ ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు, మహిళలకు వైద్యాధికారి దమయంతి రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



ఎకరం పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని మున్ననూర్ సమీపంలో కేఎల్‌ఐ కాల్వ తెగి నష్టపోయిన రైతుల పంట పొలాలను సీపీఎం బృందం ఆధ్వర్యంలో పరిశీలించారు. రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి అందజేశారు. కిల్లెగోపాల్, జగన్, లక్ష్మయ్య, రాఘవేందర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

భూత్పూర్: వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక మద్దిగట్ల, ఎల్కిచర్ల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఆగస్టు 26న శ్రీకృష్ణాష్టమిన ప్రారంభించి, బుధవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుడి నామస్మరణతో మారమ్రోగాయి. కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి శాలువాలతో సత్కరించారు. అనంతరం మద్దిగట్లలో మహిళలు చిన్నారుల కోలాటాలు, నృత్యాలు, కృష్ణుడి పాటలతో వీధుల వెంట పల్లకీసేవ నిర్వహించారు.



మద్దిగట్లలో శ్రీకృష్ణుడి పల్లకీసేవలో ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి

తక్షణ సాయం అందించాలి

మిడ్జిల్: ఇటీవల మిడ్జిల్ మండలంలో కేఎల్‌ఐ కాల్వ తెగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందజేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా అధికారులు మండలంలో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి, వారికి పరిహారం చెల్లించాలన్నారు. నాయకులు నరేందర్, తిరుపతి, రవీందర్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రం తనిఖీ



నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధుడితో మాట్లాడుతున్న మెప్మా ఇన్‌చార్జ్ పీడీ సురేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆవరణలో ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని మెప్మా ఇన్‌చార్జ్ పీడీ సురేందర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. అక్కడ ఆశ్రయం పొందిన ఇద్దరు వృద్ధులతో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అన్ని రకాల సేవలు అందించాలని షెల్టర్ మేనేజర్ రాజునాయక్‌ను ఆదేశించారు. ఏ సమయంలో ఎవరు వచ్చినా ఆశ్రయం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మహిళాశక్తి పథకం కింద కొత్తగా ఏర్పాటు చేసుకున్న మూడు యూనిట్లను ఆయన పరిశీలించారు. టీచర్స్‌కాలనీలో నిర్వహిస్తున్న లేడీస్ టైలర్స్-మ్యాచింగ్ సెంటర్, లక్ష్మీనగర్‌లోని లేడీస్ కార్నర్-బ్యాంగిల్ స్టోర్, వేంకటేశ్వరకాలనీలోని లేడీస్ బ్యూటీ పార్లర్లను తనిఖీ చేశారు. వీటిని సక్రమంగా నిర్వహించు కోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మెప్మా డీఎంసీ శివకుమార్‌గౌడ్, సీఓలు వరలక్ష్మి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐగా ఎండీ హైమద్

మహమ్మదాబాద్: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఎండీ హైమద్ పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్‌ఐ యాదయ్య బదిలీపై రాజాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. మహబూబ్‌నగర్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ హైమద్ మహమ్మదాబాద్ మండల ఆర్‌ఐగా మండల తహసీల్దార్ తిరుపతయ్య సమక్షంలో విధుల్లో చేరారు.

డప్పు కళాకారుల ర్యాలీ

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డప్పు కళాకారులు తమ సమస్యలు పరిష్కరించాలని బుధవారం ర్యాలీ తీశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి డప్పు కళాకారులు డప్పులు కొట్టుకుండా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతి అందజేశారు. రూ.8 వేల జీవనభృతి, 50 ఏళ్ల పైబడిన వారికి రూ.3 వేల ఆసరా పెన్షన్, ప్రతి కళాకారుడికి డబుల్ బెడ్రూం, కళాకారులందరికి గుర్తింపుకార్డు, జీవిత బీమా సౌకర్యం, 3 ఎకరాల భూమి, ప్రతి గ్రామ పంచాయతీలో చాటింపు చేసే ఉద్యోగిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కె.శివయ్య, వెంకటేష్ వివిధ గ్రామాలకు చెందిన డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న డప్పు కళాకారులు

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

భూత్పూర్: ఐదేళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి అజ్గర్ సుల్తానా అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని శేరిపల్లి(బి)లో పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయూబ్ ఖాన్, అంగన్‌వాడీ టీచర్, యాదమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ, ఆర్థిక సాయం అందజేత

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్, ఎండీ గౌస్‌లకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కావడంతో వాటిని కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

ఆర్థిక సాయం..

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లకి చెందిన ఎండీ. ఖాజొద్దీన్‌కు బుధవారం మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

భూత్పూర్: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌లు అందజేశారు.

నోట్‌బుక్స్..

దేవరకద్ర రూరల్: గురకొండ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నరేందర్ శర్మ బాల్యమిత్రుడు శ్రీకాంత్ ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటున్నాడు. తన మిత్రుడు పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 125 విద్యార్థుల కోసం నోట్స్, ప్యాడ్, పెన్స్, బాక్స్‌లు సెట్‌గా చేసి పంపించారు. బుధవారం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు.

పలకలు పంపిణీ..

దేవరకద్ర: మండల కేంద్రంలోని విలీన విద్య భవిత కేంద్ర వికలాంగుల పాఠశాలలో చదివే విద్యార్థులకు బుధవారం పలకలు, నోట్ బుక్స్, పెన్నులను దాత శ్రీనివాస్ గుప్తా అందజేశారు.

స్కూల్ బ్యాగులు

నవాబుపేట: చెన్నారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా కేంద్రానికి చెందిన లైన్స్‌క్లబ్ పాలమూర్ వారు బుధవారం బ్యాగులు అందజేశారు. దాతలు క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, చైర్మన్ అశోక్‌కుమార్, పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

హన్వాడ: మండల పరిధిలోని పెద్దర్పల్లిలో బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వాల ప్రక్రియ చేపట్టారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూర్జహాన్‌కు జేఏసీ నాయకులు పుష్పగుచ్ఛం శాలువాతో సన్మానించారు.

మాజీ ఎమ్మెల్సీకి నివాళి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్సీ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, అనిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం స్ఫూర్తితండాలో ఇటీవల ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయిన బాధితులను బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. బాధితుడు ముతావత్ హమిరియా నాయక్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

సిద్దేశ్వర్ పటేల్‌కు..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో 11 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందు బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర పటేల్‌ను బుధవారం బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పరామర్శించారు.

మాజీ జెడ్పీటీసీ మృతికి సంతాపం..

మిడ్జిల్: మాజీ జెడ్పీటీసీ భీమయ్యగౌడ్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందడంతో బస్టాండ్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



మున్సిపల్ కార్యాలయం ఎదుట సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్లాక్‌టవర్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు మధ్యలో మిగిలిపోయిన సగ భాగం సీసీ రోడ్డు పనులు ఎట్టకేలకు బుధవారం ఆరంభమయ్యాయి. ఏడాదిన్నర క్రితమే సుమారు రూ.50 లక్షల అంచనాతో ఒక వైపు మాత్రమే నిర్మించారు. మిగతాది అధ్వాన స్థితికి చేరుకోవడంతో ఇన్నాళ్లు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు ఈ పనులు సైతం ఇప్పుడు చేపడుతుండటంతో త్వరలో వారి సమస్యలు తీరనున్నాయి. అలాగే తాజాగా వార్డు నం.34 పరిధిలోని ఓ ఆయిల్ మిల్లు పక్కన ఫార్మేషన్ రోడ్డు పనులు చేపట్టారు. త్వరలోనే ఇక్కడ సుమారు రూ.ఎనిమిది లక్షలతో సీసీ రోడ్డు నిర్మించే అవకాశం ఉంది. కాగా, ఆయా పనులను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఎంఈ యు.బస్వరాజ్, డీఈఈ సందీప్, ఏఈలు నుస్రత్, వైష్ణవి, కౌన్సిలర్ మునీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, చిన్న పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

స్థానిక పదో వార్డు పరిధిలోని క్రిస్టియన్‌పల్లిలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుడు ఎం.రాజుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

జడ్చర్ల టౌన్: ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ పాలాది సారిక అధ్యక్షతన బుధవారం మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా ముగిసింది. 9 నెలల తరువాత నిర్వహించిన సమావేశం కావటంతో దాదాపు రూ.3 కోట్ల విలువైన పనులకు కౌన్సిల్ తీర్మానం చేశారు. ప్రతి వార్డులోనూ రూ.4 లక్షల విలువైన పనులు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు కౌన్సిలర్లు ఆమోదముద్ర వేశారు. వర్షాలు కురుస్తుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. శిథిలమైన ఇళ్లలోని వారిని సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచించాలని, వర్షాలు పడినప్పుడు ప్రత్యేక బృందాలను ఉంచాలని నిర్ణయించారు. అయితే వార్డుల్లో కమిషనర్ తరచూ పర్యటించాలని, ఆ సమాచారం సంబంధిత వార్డు కౌన్సిలర్లకు అందిస్తే కలిసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకునే వీలుంటుందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గొర్రెల సంత ఏర్పాటుకు చర్చ..

మున్సిపాలిటీ పరిధిలో కావేరమ్మపేట వద్ద ప్రతి శనివారం పశువుల సంత నిర్వహిస్తున్నారు. కొంత కాలంగా పశువుల సంత వెలవెలబోతుంది. దీంతో పశువుల సంతతో పాటు గొర్రెల సంత ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించారు. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుందామని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. సమావేశంలో కమిషనర్ ఎస్.రాజయ్య, 25 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ పీఈటీ కార్యవర్గం ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రైవేట్ పాఠశాలల పీఈటీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సోహైల్ ఉర్ రహెమాన్‌ఖాన్, కార్యదర్శిగా వి.వినోద్‌కుమార్, కోశాధికారిగా ఎస్.విజయ్‌ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలకు సంబంధించి ప్రభుత్వ పీఈటీల మాదిరిగా ప్రైవేట్ పీఈటీలకు కూడా రిలీవింగ్ చేయాలని కోరారు. ఈ రిలీవింగ్ లేఖను డీఈఓ కార్యాలయం నుంచి రావాలన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు, అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొన్న బాల్‌రాజులను ఘనంగా సన్మానం చేశారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఎండి.జియావుద్దీన్, అరుణ్, ప్రశాంత్, నర్సింలు, అహ్మద్ హుస్సేన్, సురేష్, రియాజ్, ప్రణయ్, ముజీబ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రైవేట్ పీఈటీలు

అయోమయంలో మాంస వ్యర్థాల వేలం

- వెనక్కి తగ్గిన వేలందారు

జడ్చర్ల: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో మాంస వ్యర్థాల టెండర్‌కు సంబంధించి బహిరంగ వేలంలో రూ.70.50 లక్షలు పాడి వేలం దక్కించుకున్న వ్యాపారీ యూటర్న్ తీసుకున్నాడు. దీంతో మున్సిపాలిటీకి అధిక ఆదాయం లభించిందనే సంతోషం ఎంతసేపు నిలవలేదు. మున్సిపాలిటీ పరిధిలో చికెన్, మటన్, చేపల దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించే ప్రక్రియకు సంబంధించి గతంలో మున్సిపాలిటీకి నామమాత్రం రుసుం చెల్లించి టెండర్‌ను అప్పగించినట్లుగా తెలిసింది. నెల రోజుల కిందట ఏడాది కాలానికి గాను కేవలం రూ.75 వేలు మున్సిపాలిటీకి చెల్లించి టెండర్‌ను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సిఫారసు లేఖతో వ్యాపారీ దక్కించుకున్నాడు. అయితే బహిరంగ వేలం ద్వారా మున్సిపాలిటీకి మరింత ఆదాయం సమకూరుతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే.. వెంటనే టెండర్‌ను రద్దు చేసి బహిరంగ వేలం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ నెల 2న బహిరంగ వేలం వేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన పలువురు వ్యాపారులు పోటీ పడగా.. ఎర్రవల్లికి చెందిన నర్సింహులు రూ.70.50 లక్షలకు టెండర్ దక్కించుకున్నాడు. ఇంత పెద్ద మొత్తంలో వేలం పాడటం అటు అధికారులను ఇటు ప్రజాప్రతినిధులను సైతం దిగ్భ్రాంతికి గురిచేసింది. మాంస వ్యర్థాలకు ఇంత డిమాండ్ ఉంటుందా అంటూ ఆరా తీశారు. వేలం దక్కించుకున్న వ్యక్తి డిపాజిట్ రుసుముగా రూ.2 లక్షలు చెల్లించాడు. అయితే మరుసటి రోజే వేలం దక్కించుకున్న వ్యాపారీ ఒక్కసారిగా తనకు టెండర్ వద్దని మున్సిపల్ కమిషనర్ రాజయ్యకు ఫోన్ చేసి చెప్పాడు. వేలం దక్కించుకున్న వ్యాపారీ వెనక్కి తగ్గిన విషయం తెలిసిన పలువురు ఒక్కసారిగా నివ్వెరపోయారు.

పలు అనుమానాలు:

టెండర్ దక్కించుకున్న వ్యాపారీ వెనక్కి తగ్గడం వెనుక ఎవరున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో నామమాత్రంగా మున్సిపాలిటీకి ఎంతో కొంత చెల్లించి మిగతా మొత్తాన్ని తమ జేబులోకి మళ్లించుకున్న వారెవరైనా ఒత్తిడి తీసుకొచ్చారా.. బెదిరింపులకు పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నిబంధనల మేరకు వ్యవహరిస్తాం..

వేలంకు సంబంధించి నిబంధనల మేరకు వ్యవహరిస్తామని మున్సిపల్ కమిషనర్ రాజయ్య తెలియజేశారు. వేలం దక్కించుకున్న వ్యక్తి తన టెండర్‌ను రద్దు చేసుకున్నాడని, అతను చెల్లించిన రూ.2 లక్షలు వెనక్కి ఇవ్వబోమన్నారు. రూ.70 లక్షలకు వేలం పాడిన రెండో టెండర్‌దారు కూడా ముందుకు రావడం లేదన్నారు. తదుపరి నిబంధనల మేరకు వ్యవహరిస్తామని వివరించారు.

కాల్వ నిర్మాణ పనులు పూర్తిచేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రం శివశక్తి నగర్‌లో ప్రధాన కాల్వ పనులు త్వరగా పూర్తిచేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాలనీ ప్రజలు సమస్యను మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించిన ఆయన బుధవారం కాల్వ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాల్వ పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇళ్ల మధ్య నీళ్లు ఆగడంతో దుర్వాసన వస్తుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.



మురుగు కాల్వను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పక్కాగా కుటుంబ సభ్యుల నిర్ధారణ



అన్నారెడ్డిపల్లిలో రుణమాఫీపై రైతుల వివరాలు తీసుకుంటున్న అధికారులు

రాజాపూర్: రైతు రుణమాఫీపై నిర్వహిస్తున్న కుటుంబ సభ్యుల నిర్ధారణను పక్కాగా నిర్వహించాలని జడ్చర్ల ఏడీఏ అంజనేయులు పేర్కొన్నారు. బుధవారం రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ముందుగా ఆ గ్రామ ప్రజలకు సమాచారం ఇచ్చి సర్వే నిర్వహించాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్‌కు సూచించారు. కొన్ని బ్యాంకుల నుంచి తమ లోన్స్‌ను రెన్యూవల్ చేయించుకోవాలని వస్తున్న మెసేజ్‌లతో రైతులు ఎటువంటి ఇబ్బందులకు, ఆందోళనలకు గురికావద్దని తెలియజేశారు.

రుణమాఫీపై రైతుల ఇళ్ల వద్ద పరిశీలన

మహమ్మదాబాద్: ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో కొంత మంది అర్హులైన వారికి వర్తించకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నారెడ్డిపల్లి తదితర గ్రామాలకు వ్యవసాయాధికారి నరేందర్ వెళ్లి రైతుల ఇళ్లకు వెళ్లి వివరాలు తీసుకుంటున్నారు.